# బయటికొచ్చిన సాయిబాబా

ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబను నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి గురువారం రిలీజ్ చేశారు. మావోలతో లింకు ఉన్న కేసులో రెండు రోజుల క్రితం బాంబే హైకోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన విషయం తెలిసిందే.



2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 08 -03 - 2024
సంపుటి: 1 | సంచిక : 289 | పేజీలు : 4 | వెల : 5/-

# కేసీఆర్ ఫ్యామిలీకి ఎన్నికల సవాల్




హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : మరో వారం రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడం ఖాయం. ఈమేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. పార్టీలు కూడా ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. అయితే తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడారు. మరో ఇద్దరు సిద్ధంగా ఉన్నారు. ఎమ్మెల్యేలు కూడా ఒక్కొక్కరుగా సీఎంను కలుస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే అని చెబుతున్నా.. పార్టీ మారుతారనే ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇలాంటి తరు ణంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి బయట పడాలంటే బీఆర్ఎస్ కనీసం సిట్టింగ్ స్థానాలను అయినా నిలబెట్టుకోవాలి. గత ఎన్నికల్లో 9 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ ఇప్పుడు వాటిలో మూడోవంతు కూడా గెలిచే పరిస్థితి లేదని గులాబీ భవన్‌లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ఒక కుటుంబ పార్టీ. ఇది ఎవరూ కాదనలేదు. ఆ కుటుంబంలో యాక్టివ్

మిగతా 2లో...



2లో

## బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో

# అభివృద్ధి వెనక్కి

- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కోరుతూనే ఉంటా
- రాజీవ్ రహదానరి ఎలివేటెడ్ కారిడార్‌కు సిఎం శంకుస్థాపన

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : పదేళ్ల బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో ప్రజలు నష్టపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల అవసరాన్ని మర్చిపోయి గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో గిల్లికజ్జాలు పెట్టుకుందని అన్నారు.

# రేవంత్ సర్కారుకు హైకోర్టు షాక్



## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అలీఖాన్ నియామకం గెజిట్ కొట్టివేత

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో షాక్ తగిలింది. గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుల నియామకాలపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీఖాన్ లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దాసోజు శ్రవణ్, సత్యనారాయణ నియామకాలను రద్దు చేయడంపై దాఖలైన పిటిషన్‌తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నియామకాలపై దాఖలైన మరో పిటిషన్‌పై తీర్పులు వెలువరించింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలను హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వ సిఫార్సులపై ఎమ్మెల్సీలుగా కోదండరాంతో పాటు సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించారు. ఈ వ్యవహారంపై జనవరి 30న హైకోర్టు స్టే విధించింది. కోదండరాం , అలీఖాన్‌ల

మిగతా 3లో...

ఎమ్మెల్సీల నియామకాలను రద్దు చేయడానికి గవర్నర్‌కు అధికారం లేదని, పేర్లను క్యాబినెట్‌కు తిప్పి పంపాలని స్పష్టం చేసింది. మరో పిటిషన్‌లో కోదండరాం, అలీఖాన్‌ల నియామకంపై కోర్టు స్టే విధించింది. తాజాగా నియామకాలను రద్దు చేసింది. శ్రవణ్, సత్యనారాయణల నియామకంపై అభ్యంతరాలు ఉంటే క్యాబినెట్‌కు తిప్పి పంపాలని, తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది.



# దమ్ముంటే రేపటికల్లా రుణమాఫీ చెయ్..

- మగాడివైతే ఇచ్చిన మాట నిలబెట్టుకో
- నోటికొచ్చిన సొల్లు పురాణం చెప్పుడు కాదు
- మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు రా.. తేల్చుకుందాం
- సిఎం రేవంత్‌పై బీఆర్ఎస్ ఉపనేత కేటీఆర్ ఫైర్

కరీంనగర్ - ప్రభాతసూర్యుడు : మగతనం అంటే ఎలక్షన్‌లో గెలవడం కాదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కదన భేరీ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మగాడివైతే ఒక్క సీటు గెలిపించుకో అని రేవంత్ రెడ్డి అంటున్నాడు.. దమ్ముంటే, సత్తా ఉంటే, మగాడివి అయితే.. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు రా.. సీఎం పదవికి రాజీనామా చేసి రా.. రాష్ట్రంలోని అన్ని సీట్లు కాదు.. సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి నేను రాజీనామా చేస్తాను.. మల్కాజ్‌గిరిలోనే తేల్చుకుందాం అంటే అప్పట్నుంచి

మిగతా 2లో...

# మేడిగడ్డను చూసిన ఎన్‌డీఎస్‌ఏ

## అన్నారం ప్రాజెక్టు సైతం పరిశీలన

ములుగు- ప్రభాతసూర్యుడు : బుధవారం ఢిల్లీ నుండి వచ్చిన ఎన్డీఎస్ఏ కమిటీ గురువారం నుండి మూడు రోజులపాటు ప్రాజెక్టులను కేంద్ర కమిటీ పరిశీలించి ప్రస్తుత పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్యాయాలను కమిటీ కేంద్రానికి సిఫార్సు చేయనుంది. నాలుగు నెలల లోపు రిపోర్టు అందచేయాలని నేషనల్ డ్యాన్స్ సేఫ్టీ అధికారులు గడువు


మిగతా 2లో...



# అప్పుడు ఎక్కడ ఉన్నారు మోదీజీ!

## ప్రధానికి బెంగాల్ సీఎం దీదీ ప్రశ్న

కోల్‌కతా - ప్రభాతసూర్యుడు :



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ప్రదాని మోదీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా దీదీ గురువారం మహిళా మద్దతుదారులకు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీఎంసీ నేతలపై తీవ్ర ఆరోపణలు చేస్తూ వార్తలో నిలిచిన ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. మహిళల హక్కులు, మా నిబద్ధత అనే నినాదంతో ర్యాలీ కొనసాగుతోంది. ర్యాలీలో దీదీ ముందు నడుస్తుండగా.. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆమె వెనకే ఉన్నారు. మమతా మేనల్లుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీదీ మాట్లాడుతూ.. "బెంగాల్‌లో మహిళలను హింసిస్తున్నారని బీజేపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో మహిళలు సురక్షితంగా ఉన్నారని నేను సవాలు చేయగలను. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు, హత్రాస్‌లో ఒక మహిళపై అత్యాచారం చేసి, ఆమె మృతదేహాన్ని బలవంతంగా దహనం చేసినప్పుడు, ప్రధాని మోదీ ఎక్కడ ఉన్నారు? మీరు బిల్కిస్ బానోని మరచిపోయారా?. కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజ్ఞ్ గంగోపాధ్యాయ

మిగతా 2లో...

# ఒక్క సీటైనా ఇవ్వండి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : పార్లమెంటుకు ఎన్నికలు సమీపిస్తుండటంతో జాతీయ స్థాయిలో వరంగల్ లోక్ సభ (ఎస్సీ రిజర్వ్‌డ్) స్థానం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లాబీయింగ్ ప్రారంభించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామ కృష్ణ పాండా ఢిల్లీలో ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. సిపిఐలో భాగస్వామ్య పక్షంగా వరంగల్ లోక సభ స్థానాన్ని కేటాయించాలని నేతలు ఖర్గేను కోరారు. ప్రస్తుతం భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్ గాంధీని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని ఖర్గే బదులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వరంగల్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు సీపీఐ ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. తెలంగాణ ఏర్పడ్డ తరువాత సీపీఎం పార్టీ తరపున ఆ పార్టీ ప్రస్తుత కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సుదీర్ఘ పాదయాత్ర చేశారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్యవాద పార్టీ ముద్ర నుంచి తప్పించి, మళ్లీ ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం చేసే దిశగా ఈ పాద యాత్ర ఉపయోగపడిందని ఆ పార్టీ చెబుతోంది. కానీ ఎన్నికల రాజకీయాల్లో మాత్రం ఆ ప్రభావం కనిపించలేదు. ఓటర్లు ఎలా ఆలోచిస్తున్నప్పటికీ, కమ్యూనిస్టు పార్టీల్లో పనిచేస్తోన్నవారు, వారి సానుభూతిపరులు మాత్రం ఎప్పటికైనా ఈ పార్టీలకు అవకాశం వస్తుందనే అనుకుంటున్నారు. అయితే పార్టీ సిద్ధాంతాల్లో మార్పు రావాలని కోరుకునే వారు కూడా ఉన్నారు. 80ల నుంచి మారిన ఆర్థిక పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతిన్నప్పటికీ, మళ్లీ ఏదో రోజు పుంజుకుంటాయని హరగోపాల్ అంటున్నారు. "ప్రపంచం అంతా కమ్యూనిస్టులు దెబ్బతిన్నారు. మళ్లీ పుంజుకుంటున్నారు. ఇప్పుడు మళ్లీ మార్పు వస్తోంది. అందుకు నిదర్శనంగా గ్రీస్, బ్రెజిల్ కనిపిస్తున్నాయి. అమెరికాలో సంపద పంచుతాను అన్న శాండర్స్‌కి 6 శాతం ఓట్లు రావడం ఒక పరిణామం" అన్నారు హరగోపాల్. "క్రోనీ క్యాపిటలిజం మీద కష్టజీవులకు ఆగ్రహం

మిగతా 2లో...



వచ్చే ఎన్నికల్లో వరంగల్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు సీపీఐ ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. తెలంగాణ ఏర్పడ్డ తరువాత సీపీఎం తరపున ఆ పార్టీ ప్రస్తుత కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సుదీర్ఘ పాదయాత్ర చేశారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్యవాద పార్టీ ముద్ర నుంచి తప్పించి, మళ్లీ ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం చేసే దిశగా ఈ పాదయాత్ర ఉపయోగపడిందని ఆ పార్టీ చెబుతోంది.



# మల్లారెడ్డి అల్లుడికి షాక్...

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు మల్లారెడ్డి కి రెవిన్యూ అధికారులు షాక్ ఇచ్చారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాటిని కూల్చేశారు. మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి నిర్వహిస్తున్న ఎంఎల్ఆర్ఐటి లో ప్రభుత్వ భూములు ఉన్నాయని గుర్తించిన రెవిన్యూ అధికారులు గురువారం ఉదయాన్నే భారీ బలగాల మధ్య వాటిని కూల్చేశారు. భవనాలను కూలుస్తున్న సమయంలో కాలేజీ సిబ్బంది రెవిన్యూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని హెచ్చరించడంతో సిబ్బంది భవనాలను కూల్చివేత కొనసాగించారు. చెరువు భూమిని ఆక్రమించి నిర్మాణాలను చేపట్టినట్టు రెవిన్యూ అధికారులు వివరించారు. దుండిగల్ ఎంఎల్ఇఆర్‌టి కాలేజీని చిన్న దామర చెరువులో నిర్మించినట్టు

మిగతా 2లో...

# రికార్డు స్థాయిలో మేడారం ఆదాయం

- సమ్మక్క జాతరలో 540 హుండీలు
- రూ.13.25కోట్లు ఆదాయం లభ్యం
- గతసారి కంటే రూ.1.79కోట్లు అధికం



3లో

# 24కోట్ల మందికి జీరో టికెట్!

- డిసెంబర్ 9, 2023న మహాలక్ష్మీ పథకం ప్రారంభం
- రోజుకు 30లక్షల మంది మహిళలు బస్సు ప్రయాణం

4లో



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## జమ్మికుంటలో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్

**రైల్వేశాఖకు కృతజ్ఞతలు తెలిపిన బండి**

కరీంనగర్,ప్రభాతసూర్యుడు : కరీంనగర్ ప్రజలకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న చిరకాల వాంఛ నెరవేర్చనుంది. సికింద్రాబాద్–దానాపూర్ ఎక్స్ ప్రెస్ రైలు (12791/92) ఈనెల 12 నుంచి జమ్మికుంటలో ఆగనుంది. ప్రతిరోజు ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య జమ్మికుంటలో ఈ రైలు ఆగనుంది. దానాపూర్ ఎక్స్ ప్రెస్‌ను జమ్మికుంటలో ఆపేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యాసాధ్యాలపై రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో స్వయంగా మాట్లాడారు. తప్పనిసరిగా జమ్మికుంటలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్లే ఎక్స్ ప్రెస్ రైలును జమ్మికుంట స్టేషన్‌లో ఆగేలా ఏర్పాట్లు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల 25 నిమిషాలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే దానాపూర్ ఎక్స్ ప్రెస్ ఖాజీపేట మీదుగా జమ్మికుంట చేరుకోనుంది.

## బిఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో

# అభివృద్ధి వెనక్కి

- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కోరుతూనే ఉంటా
- రాజీవ్ రహదానరి ఎలివేటెడ్ కారిడార్‌కు సిఎం శంకుస్థాపన
- ఉత్తర తెలంగాణ ముఖచిత్రం మారుతుందని వెల్లడి



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : పదేళ్ల బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో ప్రజలు నష్టపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల అవసరాన్ని మర్చిపోయి గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో గిల్లికజ్జాలు పెట్టుకుందని అన్నారు. దీంతో రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పక్కన పెట్టిందని మండిపడ్డారు. గురువారం నాడు సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాజీవ్ రహదారి ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణతో ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఈ ప్రాజెక్టు అవసరాన్ని వివరించామని చెప్పారు. భూముల కేటాయింపు, చాంద్రాయణగుట్ట రక్షణ శాఖ భూముల లీజ్ రెన్యూవల్ చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే తక్షణమే తాము అధికారులతో సమీక్షించి రక్షణ శాఖకు భూములు అప్పగించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం కూడా తమకు సహకరించిందని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఏదైనా ఒక శాశ్వత అభివృద్ధి పనిని చేశారా? అని ప్రశ్నించారు.

ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ఎలివేటేడ్ కారిడార్ పూర్తవ్వా లని అన్నారు. ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగానని.. రాజకీయాల కోసం కాదని చెప్పారు. ఈ నగరంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ పాలనలోనే అని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గంజాయి, డ్రగ్స్, పబ్బులు తప్ప ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. ఈ ఎలివేటేడ్ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని తెలిపారు. అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ కేంద్రాన్ని అడుగుతూనే ఉంటామని.. కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని అన్నారు. ఈ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసామని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రాజకీయాలని.. ఎన్నికలు ముగిశాక అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమ పోరాటం ఫలించిందని మాజీమంత్రి కేటీఆర్ అంటున్నారు... ఆయన ఏం పోరాటం చేశారని ప్రశ్నించారు. ట్విట్టర్‌లో వ్యంగ్యంగా పోస్టులు పెట్టుడు తప్పితే ఆయన చేసిందేమి లేదని ధ్వజమెత్తారు. తాము కేంద్రం నుంచి అనుమతులు తీసుకొస్తే కేటీఆర్ పోరాటం చేశారని చెప్పుకుం టున్నారని విరుచుకుపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అభివృద్ధి కోసం భవిష్యత్ లోనూ కేంద్రం సహకారాన్ని కోరుతూనే ఉంటామని.. కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. 11.3 కిలో మీటర్ల పొడవున 6 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలన్నారు. కేటీఆర్ చచ్చుడో అభివృద్ధికి నిధులు వచ్చుడో తేలే వరకు దీక్ష చేయాలని.. ఆయన దీక్షకు దిగితే మా కార్యకకర్తలే కెటిఆర్ ను కంచె వేసి కాపాడుతారని సీఎం రేవంత్ అన్నారు.

అంతకుముందు నగరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. చదువు మీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వచ్చాయన్నారు.కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. ఒకసారి దొరల చేతిలో ఉంటే.. ఒకసారి దళితుల చేతుల్లో ఉంటుందన్నారు.

దొరలకు ఇష్టం ఉన్నా లేకున్నా అసెంబ్లీలో గడ్డం ప్రసాద్‌ను అధ్యక్షా అని పిలవాల్సిందేనన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ ప్రభుత్వం, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో... డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవంలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన. .దేశంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో సంస్కరణలకు కృషి చేశారని తెలిపారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన గాంధీ కుటుంబంతో, కాంగ్రెస్ పార్టీతో కొనసాగారని చెప్పారు.

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్న తికి మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విడివిడిగా ఉండేవని తెలిపారు రేవంత్. దళితులు, గిరిజనులు, బీసీ మైనార్టీలందరికీ ఒకేచోట ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఒకే క్యాంపస్ లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి కులాల మధ్య అంతరాలు చెరిపేస్తామన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ లో శంకుస్థాపన చేశామన్నారు. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దు.. చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని రేవంత్ రెడ్డి చెప్పారు.

## బయటికొచ్చిన సాయిబాబా

**నాగ్‌పూర్ జైలు నుంచి విడుదల**



నాగపూర్ - ప్రభాతసూర్యుడు : ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ ను నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి గురువారం రిలీజ్ చేశారు. మావోలతో లింకు ఉన్న కేసులో రెండు రోజుల క్రితం బాంబే హైకోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన విషయం తెలిసిందే. 2017 నుంచి ప్రొఫెసర్ సాయిబాబ.. నాగపూర్ సెంట్రల్ జైలులోనే ఉంటున్నారు. 2014 నుంచి 2016 వరకు కూడా ఆయన జైలులో ఉన్నారు. ఆ తర్వాత బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. ఇవాళ జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఆయన మీడియాతో మాడ్లాడారు. తన ఆరోగ్యం చాలా బలహీనంగా ఉందని,ఇప్పుడు తానేమీ మాట్లాడలేనని, ముందుగా మెడికల్ ట్రీట్మెంట్ తీసుకోవాలని, ఆ తర్వాత తాను మాట్లాడనున్నట్లు ఆయన చెప్పారు. మావోలతో లింకున్న కేసులో సాయిబాబకు జీవితకాల శిక్ష పడింది. అయితే ఆయనపై ఉన్న ఆరోపణలను ప్రాసిక్యూషన్ ప్రూవ్ చేయలేకపోయింది.

## అప్పుడు ఎక్కడ ఉన్నారు మోదీజీ!

మొదటిపేజీ తరువాయి..



బీజేపీలో చేరారు. అలాంటి వారి నుంచి న్యాయం ఎలా ఆశించగలం” అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మమతా ఏటా మహిళా మార్చ్‌కు నాయకత్వం వహిస్తారు. శివరాత్రి పండగ కారణంగా ఈ ఏడాది ఒకరోజు ముందుగానే ర్యాలీ నిర్వహించారు. మోదీ ఏమన్నారంటే.. నారీశక్తితో బెంగాల్లోని మమతా బెనర్జీ సారథ్యంలోని పాలక టీఎంసీ పతనం ఖాయమని ప్రధాని మోదీ అన్నారు. నదీతీర ద్వీపం సందేశ్ ఖాలీలో ఆ పార్టీ నేతల అఘాయిత్యాలు రాష్ట్రంలో, దేశంలో మహిళలను ఆగ్రహోదగ్రులను చేసిందని.. బెంగాల్‌వ్యాప్తంగా ఆవరించిన ఈ తుఫాన్ ధాటికి టీఎంసీ అంతరిస్తుందని స్పష్టం చేశారు. బుధవారం ఆయన కోల్‌కతాలో హుగ్లీ నదీగర్భంలో నిర్మించిన మెట్రో రైలును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బారాసాత్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు.

## దమ్ముంటే రేపటికల్లా రుణమాఫీ చెయ్..

మొదటిపేజీ తరువాయి..



సడిచప్పుడు లేదు. అందుకే అంటున్నా మగతనం అంటే ఎలక్షన్లు గెలుచుడు కాదు.. మగాడివి అయితే ఇచ్చిన మాట నిలబెట్టుకో. దమ్ముంటే మార్చి 9వ తేదీ వరకు రుణమాఫీ చేసి చూపించు. పంటలకు నీళ్లు ఇవ్వు.. రైతు భరోసా ఇవ్వు.. మహాలక్ష్మి కింద మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నావు.. దమ్ముంటే ఈ పనులు చేసి చూపించు. నోటికొచ్చిన సొల్లు పురాణం చెప్పుడు కాదు. ప్రజలను కించపరించే విధంగా చిల్లర మాటలు మాట్లాడడం కాదు. ప్రజలు మంట మీద ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఆగం చేసిందనే కోపం మీద ఉన్నారు అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇవాల్టికి 90 రోజులు అవుతుంది. మరో 10 రోజులు అయితే వంద రోజులు పూర్తువుతుంది. వంద రోజుల్లో చాలా చేస్తానని రేవంత్ చెప్పారు. అధికారంలోకి రాగానే రూ. 15 వేలు రైతుబంధు వేస్తా అన్నాడు. రైతు భరోసా అన్నాడు కానీ భరోసా లభించలేదు. రైతులు మోసపోయి ఓట్లు వేశామని బాధపడుతున్నారు. కేసీఆర్ ఇచ్చే రైతుబంధు కూడా పడకపాయే కదా అని రైతులు అనుకుంటున్నారు. రేవంత్‌కు రైతుబంధు ఇచ్చే తెలివి కూడా లేదని రైతులు చర్చ పెడుతున్నారు. రాష్ట్రంలో ఉండే రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తా.. ఆ ఫైలుపై డిసెంబర్ 9న సంతకం చేస్తానని రేవంత్ అన్నాడు. మరి ఎప్పుడు రుణమాఫీ చేస్తావు..? అని కేటీఆర్ నిలదీశారు.

## మల్లారెడ్డి అల్లుడికి షాక్...

మొదటిపేజీ తరువాయి..



ఆరోపణలు ఉన్నాయి. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కాలేజీపై చర్యలు తీసుకోడానికి అధికారులు సాహసించలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలను చేపట్టిన వారిపై కఠిన చర్యలు ప్రారంభించారు.ఈ క్రమంలో మల్లారెడ్డి అల్లుడు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిన్నదామర చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనే అభియోగాలతో భవనాలను కూల్చివేశారు. మేడ్చల్, దుండిగల్ ప్రాంతంలోని బఫర్ జోన్ నిర్మాణాలను తొలగించారు.

## ఒక్క సీటైనా ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి..



వచ్చిన రోజు మేం ఉంటాం. యువత అసంతృప్తితో ఉన్నారు. వారు మావైపు వస్తారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నప్పుడు కచ్చితంగా కమ్యూనిస్టు పార్టీ నిలబడుతుంది” అన్నారు ప్రసాద్.ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపోరాటం (భూపోరాటం) కారణంగా ప్రజల్లో మంచి పట్టు ఉండటంతో ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని ఆ పార్టీ ధీమాగా ఉంది. పైగా సిపిఐ, దాని అనుబంధ సంఘాలైన సింగరేణి, ఎల్ ఐసి, బ్యాంకింగ్ మొదలైనవి ఈ ప్రాంతంలో చాలా బలంగా ఉన్నాయి.దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉన్న సీనియర్ జర్నలిస్ట్ బీఆర్ లెనిన్ (55) అభ్యర్థిత్వాన్ని పార్టీ నాయకత్వం ఖరారు చేసింది. అంతేకాక, లెనిన్ తన తండ్రి బి.ఆర్.భగవాన్ దాస్ వారసత్వాన్ని కలిగి ఉన్నాడు. ఈ ప్రాంతంలో కార్మిక సంఘాల ప్రయోజనాల కోసం పోరాడిన ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కలపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, “లెనిన్ కు బిఆర్ఎస్, బిజెపి కంటే అడ్వాంటేజ్ ఉంటుంది, ఎందుకంటే అతని తండ్రి కార్మిక సంఘాలు. ప్రజలలో మంచి గుర్తింపు ఉంది” అని అన్నారు.ముఖ్యంగా జర్నలిస్ట్ యూనియన్ నాయకుడిగా లెనిన్ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ కు నేతృత్వం వహించిన లెనిన్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. కొవిడ్–19 విలయతాండవం చేసినప్పుడు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తూ నిరుపేదలకు సేవలందించారు. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకొని సీపీఐ ఒక్క సీటును గెలుచుకున్న విషయం తెలిసిందే.

## కేసీఆర్ ఫ్యామిలీకి ఎన్నికల సవాల్

మొదటిపేజీ తరువాయి..



పాలిటిక్స్ చేసేవారిలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత. కవిత, కేసీఆర్ గతంలో ఎంపీలుగా పనిచేశారు. తాజాగా కేటీఆర్ కూడా మల్కాజ్‌గిరిలో చూసుకుందాం రా అంటూ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ తరపున కేసీఆర్ కుటుంబంలో ఒకరిద్దరు పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ, క్యాడర్‌లో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదు. మరోవైపు పార్టీని వీడుతున్నవారు పెరుగుతున్నారు. దీంతో క్యాడర్‌లో నైరాశ్యం కనిపిస్తోంది. ఇప్పటికే ముగ్గురు ఎంపీలు పార్టీని వీడారు. ఐదారుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. కీలక నేతలు కూడా పార్టీని వీడారు. మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు కాంగ్రెస్ వశం అవుతున్నాయి. ఈ తరుణంలో లోక్‌సభ ఎన్నికల్లో గెలవడం బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారింది.కేసీఆర్ కుటుంబంలో ప్రస్తుత పరిస్థితిలో కవిత ఒక్కరే ఎంపీగా పోటీ చేసే అవకాశం కనిపిస్తుది. కేసీఆర్ మెదక్ నుంచి బరిలో ఉంటారని ప్రచారం జరుగుతున్నా స్పష్టత లేదు. కేటీఆర్ సవాల్ కేవలం రేవంత్‌ను రెచ్చగొట్టడానికే. పార్టీ పరిస్థితుల దృష్టా కేసీఆర్ లేదా కేటీఆర్ ఎంపీగా పోటీ చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉండే అవకావం కనిపిస్తోంది. తెలంగాణలో ప్రీపోల్ సర్వే చేసిన పలు సంస్థలు కూడా ఇదే విషయాన్ని నిర్ధారించాయి. అన్ని సర్వేల్లో బీఆర్ఎస్ ఒకటి రెండు సీట్లు మాత్రమే గెలుస్తుందని తెలిపాయి. అంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను పట్టించుకునే అవకాశం కనిపించడం లేదు. ఇది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం మూటగట్టుకుంటే.. ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ నేతలు మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ఉంటుందని అంటున్నారు. అయితే మాటలతో కాకుండా చేతల్లో చూపించేలా కేసీఆర్ కుటుంబం నుంచి పోటీ చేయాలని క్యాడర్ కోరుతోంది.

## మేడిగడ్డను చూసిన ఎన్‌డీఎస్ఏ

మొదటిపేజీ తరువాయి..

విధించింది. ఈ కమిటీకి కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఈ కమిటీకి చైర్మన్ గా ఉన్నారు. ఆయనతోపాటు యూసీ విద్యార్థి ఎస్ఏ చైర్ పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సి, అమితాబ్ మీనా ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. గురువారం ఉదయం మేడిగడ్డకు చేరుకుని బ్యారేజీలోని పిల్లర్లు కుంగిన ప్రాంతాన్ని, పగుళ్లను, 20వ పిల్లర్ వద్ద ఏర్పడిన సి పేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. మేడిగడ్డ నుండి బయలుదేరి అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. అన్నారం బ్యారేజీలో సి పేజీలను, పిల్లర్లు ఎక్కడైనా పగుళ్లు వచ్చాయా, కుంగిపోయాయా అనే వాటిని పరిశీలించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# రెండు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

**ఖమ్మం - ప్రభాతసూర్యుడు :** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో రెండు రోడ్డు ప్రమాదాల్లో లారీ,కారు ఢీకొని పలువురు వ్యక్తులకు గాయాలయ్యాయి.వైరా నుండి ఖమ్మం వైపు వెళ్తున్న లారీని ఖమ్మం వైపు వెళ్తున్న కారు వెనక వైపు నుండి ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి అదే ప్రాంతంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న పాదచారుని లారీ ఢీకొట్టడంతో ప్రమాదంలో పాదాచారునికి తీవ్ర గాయాలయ్యాయి సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వ్యక్తులను అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు..




# రికార్డుస్థాయిలో మేడారం ఆదాయం

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** గిరిజన కుంభమేళా మేడారం మహా జాతర హుండీల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయింది. ఈ ఏడాది సమ్మక్క సారక్క జాతరకు వచ్చిన భక్తులు తమ కానుకులను సమర్పించుకున్నారు. వాటిని లెక్కించగా రూ. 13 కోట్ల 25 లక్షల 22 వేల 511 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత జాతర కంటే తాజాగా ముగిసిన మేడారం జాతరకు రికార్డు ఆదాయం వచ్చింది. 2022 జాతర ఆదాయం కంటే ఈ సారి 1 కోటి 79 లక్షల 87 వేల 985 రూపాయల ఆదాయం ఎక్కువగా వచ్చింది. హనుమకొండ కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో 8 రోజుల పాటు మేడారం జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు జరిగింది.ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు మేడారం సమ్మక్క సారలమ్మల జాతర జరిగింది. జాతరకు కోటి 40 లక్షల మంది భక్తులు తరలవచ్చి అమ్మలను దర్శించుకున్నారు. జాతరకు రాలేని వారు ఇంటి నుంచే మొక్కులను సమర్పించుకున్నారు. మేడారం జాతరలో భక్తులు కానుకలు సమర్పించుకోవడం కోసం 540 హుండీ లు ఏర్పాటు చేయగా 13 కోట్ల 25 లక్షల 22 వేల 511 రూపాయల ఆదాయం సమకూరింది. హన్మకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఫిబ్రవరి 29 నుండి మార్చి 6వ తేదీ వరకు 8 రోజుల పాటు లెక్కింపు జరిగింది. 350 మంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నారు. 150 మంది దేవాదాయశాఖ సిబ్బంది. 200 మంది స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు లెక్కించారు. నోట్లు, కాయిన్స్, బియ్యంను వేరు చేయడం కోసం ప్రత్యేకంగా రెండు యంత్రాలను ఉపయోగించారు. దేవాదాయ, రెవెన్యూ,



పోలీస్ శాఖల పర్యవేక్షణలో ఎనిమిది రోజులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌంటింగ్ కొనసాగింది. నోట్లు, కాయిన్స్ కలుపుకొని13 కోట్ల25 లక్షల 22 వేల 511 రూపాయల ఆదాయం వచ్చింది. ఇవి కాక 779 గ్రాముల 800 మిల్లిల బంగారం, 55 కిలోల 150 గ్రాముల వెండి, ఆరు దేశాలకు చెందిన 308 కరెన్సీ నోట్లు వచ్చాయి. వచ్చిన ఆదాయం, బంగారం, వెండి ని బ్యాంకులో జమ చేశామని వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ రావు చెప్పారు.మేడారం హుండీల ద్వారా వచ్చిన ఆదాయంలో 33 శాతం గిరిజన పూజారులకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని దేవాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ రావు తెలిపారు. 15 రోజుల తరువాత నగదుతో పాటు వెండి, బంగారం లెక్కించి పంచడం జరుగుతుందని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈ సారి హుండీల్లో ప్రభుత్వం రద్దు చేసిన 5 వందల, 2 వేల నోట్ల తో పాటు ఫేక్ కరెన్సీని సైతం గుర్తించారు. రద్దయిన నోట్లు, గాంధీకి బదులుగా అంబేద్కర్ ఫొటోలతో ఉన్న ఫేక్ కరెన్సీని కొందరు భక్తులు హుండీల్లో కానుకలుగా వేశారు

# నీటి సంక్షోభంలో బెంగళూర్ నగరం

**బెంగళూర్ - ప్రభాతసూర్యుడు :** బెంగళూర్ నగరంలోని పలు ప్రాంతాల్లో బోర్‌వెల్స్ ఎండిపోవడంతో మార్చిలోనే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి.నీటి సంక్షోభంలో నగరం విలవిలలాడుతోంది. నీటి కోసం పొడవాటి క్యూల్లో వేచిఉండాల్సి వస్తోందని ఆర్ఆర్ నగర్ వాసులు వాపోతున్నారు. స్థానికులు నీటి కోసం వాటర్ ట్యాంకర్లపై ఆధారపడటంతో అధిక ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదని చెబుతున్నారు.కొద్దిపాటి నీటితోనే ఇంట్లో వారంతా సర్దుకోవాల్సి వస్తోందని అంటున్నారు. స్నానం చేసేందుకు, వంట చేసుకునేందుకు కూడా తగినంత నీరు ఉండటం లేదని మహిళలు నీటి కష్టాలను ఏకరువు పెట్టారు. గత మూడు నెలలుగా నీటి కొరత వెంటాడుతోందని తాము నిత్యం బీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (బెంగళూర్ నీటి సరఫరా, సీవరేజ్ బోర్డ్) అధికారికి ఫోన్ చేస్తున్నా ఫలితం లేదని చెప్పారు. తాను ప్రతిరోజూ తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌కు



వస్తున్నానని, ఇక్కడకు కేవలం ఒక వ్యక్తినే అనుమతిస్తున్నారని గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని వివరించారు.ప్రైవేట్ ట్యాంకర్లు గతంలో క్యాన్‌కు రూ. 600–రూ.1000 వసూలు చేయగా ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ. 2000కుపైగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశా–రు. ప్రైవేట్ ట్యాంకర్లను ధర తగ్గించాలని ప్రభుత్వం కోరిన తర్వాత వారు తమ ప్రాంతానికి రావడం నిలిపివేశారని తెలిపారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి ఈమెయిల్స్ పంపుతున్నా స్పందన లేదని వాపోతున్నారు.

# వేములవాడ మునిసిపల్ వైస్ ఛైర్మన్ హస్తగతం




**వేములవాడ - ప్రభాతసూర్యుడు :** వేములవాడ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ పదవికి జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్ల మద్దతుతో ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన బింగి మహేష్ కైవసం చేసుకున్నారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లు 28 మంది ఉండగా, ఎక్స్ అఫీషియో మెంబర్ గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. బింగ మహేష్ కు మద్దతుగా 18 ఓట్లు రాగా, బిఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్న మారం కుమార్ కు 11 ఓట్లు వచ్చాయి. ఏడు ఓట్ల తేడాతో బింగి మహేష్ విజయం సాధించారు. కాగా, మహేష్‌కు బిఆర్ఎస్ కు చెందిన నలుగురు, బిజేపి కి చెందిన ఆరుగురు కౌన్సిలర్ లతో పాటు కాంగ్రెస్ కు మద్దతు తెలిపారు. గత వైస్ ఛైర్మన్ మధు రాజేందర్ రాజీనామా తో అడిషనల్ కలెక్టర్ గౌతమి ఎన్నికలు నిర్వహించారు. వైస్ ఛైర్మన్ గా ఎన్నికైన మహేష్ మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడతానన్నారు. అయితే, సొంత పార్టీ వారే తనను మోసం చేయడం బాధాకరంగా ఉందని కుమార్ అన్నారు.

# గుత్తా కొడుకు దిగేనా..?

## పోటీకి దూరమంటూ ప్రచారం

**నల్గొండ, ప్రభాతసూర్యుడు :** దీపం ఉండగానే ఇంటినిచక్కబెట్టుకోవాలని భావించిన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తనయుడు గుత్తా అమిత్ రెడ్డిని పొలిటికల్ ఎంట్రీ చేయించాలని భావించారు. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ, మునుగోడుల నుండి తనయుడి పొలిటికల్ ఎంట్రీకి గుత్తా సుఖేందర్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా అమిత్ వ్యవహరించాడు. పార్లమెంట్ ఎన్నికల్లో తనయుడు పొలిటికల్ ఎంట్రీకి గుత్తా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు గుత్తా సుఖేందర్‌రెడ్డి.. అటు అమిత్ కూడా.. నల్లగొండ ఎంపీగా పోటీ చేయడానికి తాను సిద్ధమంటూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బహిరంగంగానే ప్రకటించారు.అసెంబ్లీ ఎన్నికలో ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని వ్యూహాలకు పదును పెడుతోంది. గులాబీ దళపతి పార్లమెంటు నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను కేవలం సూర్యాపేటలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో ఈసారి నల్గొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయడం బీఆర్ఎస్ కు సవాల్ గా మారింది.సుఖేందర్ రెడ్డితో ఉన్న పాత వైరానికి కొందరు నేతలు కొత్త పదును పెట్టారట. ఇందులో భాగంగానే నల్లగొండ నుండి పోటీకి కొందరు మాజీల పేర్లను తెరపైకి తీసుకు వచ్చిందట. ఇదంతా అమిత్‌కు టికెట్ రాకుండా చెక్ పెట్టేందుకేనని పార్టీలో టాక్. నల్లగొండ, భువనగిరిలో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీకి సిద్ధమేనని గుత్తా చెప్పారు. తమకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యేలంతా జట్టు కట్టినందున ఇలాంటి పరిస్థితుల్లో పోటీ చేయడం కంటే.. కామ్‌గా ఉండటమే గౌరవప్రదమని గుత్తా భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో తాజాగా పార్లమెంటుకు పోటీపై గుత్తా పునరాలోచనలో పడ్డారట. కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సుఖేందర్ రెడ్డి ఆశలపై.. సొంత పార్టీ నేతలే నీళ్లు చల్లడాన్ని గుత్తా జీర్ణించుకోలేక పోతున్నారట. ప్రస్తుతం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు తాను పోటీకి సిద్ధమైతే సహకరించాల్సింది పోయి.. వ్యతిరేకించడం ఏంటని గుత్తా ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. తమను ఉద్దేశ్యపూర్వకంగా వ్యతిరేకిస్తున్న వారితో మాట్లాడి సమన్వయం చేయాల్సిన పార్టీ పెద్దలు కూడా మిన్నకుండడం పట్ల గుత్తా ఫ్యామిలీ అసంతృప్తితో ఉందట. తమను వ్యతిరేకిస్తున్న నేతల్లో సీనియర్ గా ఉన్న ప్రజా ప్రతినిధి.. ఎంపీగా పోటీకీ దిగుతారా అని సవాల్ చేస్తున్నారట.అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన కాంగ్రెస్.. పార్లమెంటు ఎన్నికలకు కూడా దూకుడు పెంచుతోంది. అయితే బీఆర్ఎస్ లో మాత్రం టికెట్ల గోలతో నేతల మధ్య కోల్డ్ వార్ పిక్ స్టేజికి వెళ్తోందట. దీంతో పార్టీ క్యాడర్ ఆందోళన చెందుతుందట.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను కేవలం సూర్యాపేటలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో ఈసారి నల్గొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయడం బీఆర్ఎస్ కు సవాల్ గా మారింది.సుఖేందర్ రెడ్డితో ఉన్న పాత వైరానికి కొందరు నేతలు కొత్త పదును పెట్టారట. ఇందులో భాగంగానే నల్లగొండ నుండి పోటీకి కొందరు మాజీల పేర్లను తెరపైకి తీసుకు వచ్చిందట. ఇదంతా అమిత్‌కు టికెట్ రాకుండా చెక్ పెట్టేందుకేనని పార్టీలో టాక్.



# రేవంత్ పచ్చి అబద్ధాలు

## ఎమ్మెల్సీ కవిత చిట్ చాట్

**హైదరాబాద్ -ప్రభాతసూర్యుడు :** రాష్ట్రంలో కృత్రిమమైన కరువు వుంది. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఈ కరువు. కేసిఆర్ ను బద్నాం చేయాలని కుట్ర చేస్తున్నారు. సాగు నీరు, తాగునీరు ఇవ్వలేం అని ముఖ్యమంత్రి అంటున్నారు. నెత్తిమీద కాళేశ్వరం ప్రాజెక్ట్ ఉన్న దాన్ని సద్వినియోగం చేసుకోవట్లేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన లో బి సి మేజర్ కులాల ప్రాధాన్యత లేదు. మున్నూరు కాపు,ముదిరాజ్,యాదవ సామాజిక వర్గాల నుండి క్యాబినెట్ లో మంత్రి లేదు. రేవంత్ రెడ్డి బీజేపీ తో కలుస్తారు. బీజేపీ సపోర్ట్ తో 10 యేళ్లు ఉంటా అని అంటున్నాడు. అందుకే రేవంత్ రెడ్డి అంతు చూస్తా అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు చూస్తుంటే ఆయనపై కేసులు పెట్టాలి. అంతుచూస్తా,మానవ బాంబులు ఐతరు అని మాట్లాడ్డం దుర్మార్గం. కేసిఆర్ నియంత అని మాట్లాడారు..ఆ మేధావులు ఇప్పుడు నిర్బంధాలపై మాట్లాడట్లేదు. మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా నిలవబోతుంది రేవంత్ సర్కార్. బి.సి కులగణన తీర్మానం చేశారు..చట్ట బద్దత లేదని అన్నారు. ముఖ్యమంత్రి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. ధర్నా చౌక్ లో పర్మిషన్ ఇవ్వట్లేదు. ఖచ్చితంగా రేపు జాగృతి అధ్వర్యంలో దీక్ష చేసి తీరుతాం. ఎంపి గా పోటీ చేయాలని పార్టీ నిర్ణయంపై కట్టుబడి ఉంటా. అరవింద్ ఎక్కడ నిలబడ్డా ఒడిస్తా..మొన్న కోరుట్లలో ఒడించా..ఎంపి ఎన్నికల్లో అదే..అది ఎప్పుడూ పర్మినెంట్ అజెండా.



ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన ఇది.యు ట్యూబ్ చానెల్ మీద తీవ్ర కేసులు పెడుతున్నారని అన్నారు. పిల్లల శవాలు చూస్తుంటే తెలంగాణ ఉద్యమ రోజులు గుర్తుకు వస్తున్నాయి. రెండు జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలను బొంద పెట్టాలని చూస్తున్నాయి. లిక్కర్ కేసు...పెద్ద కేసు కాదు. కేసును టివి సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు...నాకు కూడా పెద్ద ఇంటరెస్ట్ లేదు..మా లీగల్ టీం దాన్ని చూసుకుంటుంది. నేను బాధితురాలిని...ఫైట్ చేస్తా. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ప్రశ్నించారు.



# తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు..

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ జియోగుడాలో ఇల్లిగల్ గా తయారీ చేస్తున్న కాస్మోటిక్స్ స్థావరంపై తనిఖీలు జరిపారు. నాగ్రిస్ హెర్బ్స్ అనే సంస్థ తయారు చేస్తున్న పకీజా గోల్డ్ మెహందీ కోన్, పాకీజా ఆర్ట్ హెన్నా, పాకీజా ఫాస్ట్ ఆర్ట్ హెన్నా ఇన్స్టంట్ కోన్, పాకీజా ప్యూరిఫైడ్ వంటి బ్రాండ్ పేర్లతో మెహందీ కోన్స్ (హెన్నా పేస్ట్), హెన్నా పౌడర్తో సహా కాస్మోటిక్స్ సీజ్ చేసారు. హెన్నా పౌడర్ కాస్మెటిక్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నారు. మహబూబ్ నగర్ లో మూర్ఛ చికిత్స కోసం తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తూ జాడీ బూటీ, నరిషింగ్ హెయిర్ ఆయిల్ సీజ్, జడ్చర్లలో బెల్లాకేర్ సిరప్ తో స్త్రీలకు చికిత్స చేస్తున్నందుకు తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు సీజ్ చేసారు.

# రేవంత్ సర్కారుకు హైకోర్టు షాక్

మొదటిపేజీ తరువాయి..
నియామకాలను రద్దు చేయడంతో పాటు గతంలో దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు దాఖలు చేసిన పిటిషన్‌పై కీలక తీర్పు వెలువరించింది.గత ఏడాది గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్‌కు సిఫార్సు చేసింది. ఆ పేర్లను గవర్నర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత జనవరిలో కోదండరాం, అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడంతో గవర్నర్ అమోదించారు.కోర్టు వివాదం పెండింగ్‌లో ఉండగా నియామకాలు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరో పిటిషన్ దాఖలైంది. రెండు వేర్వేరు పిటిషన్లపై నేడు తీర్పు వెలువడింది. ఎమ్మెల్సీల నియామకాలను రద్దు చేయడానికి గవర్నర్‌కు అధికారం లేదని, పేర్లను క్యాబినెట్‌కు తిప్పి పంపాలని స్పష్టం చేసింది. మరో పిటిషన్‌లో కోదండరాం, అలీఖాన్‌ల నియామకంపై కోర్టు స్టే విధించింది. తాజాగా నియామకాలను రద్దు చేసింది. క్యాబినెట్ ద్వారా ఎమ్మెల్సీలపై సిఫార్సులను పరిగణలోకి తీసుకుని జాబితాను గవర్నర్‌కు పంపాలని ఆదేశించింది.శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్లను అనుమతించడం ద్వారా వారికి ఊరట దక్కింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి క్యాబినెట్ మళ్లీ కొత్తగా ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. శ్రవణ్, సత్యనారాయణల నియామకంపై అభ్యంతరాలు ఉంటే క్యాబినెట్‌కు తిప్పి పంపాలని, తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది.ఈ ఏడాది జనవరి 30వ తేదీన గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి తెలంగాణ హైకోర్టు బ్రేక్ వేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది.ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్ ను గవర్నర్ తమిళ సై గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించారు. ఆ నియామకాన్ని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రమాణ స్వీకారం చేయించవద్దని ఉత్తర్వులు ఇచ్చింది.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణను కేబినెట్ నామినేట్ చేసింది. వీరి పేర్లను గవర్నర్ తమిళి సై ఆమోదానికి పంపారు. అయితే గవర్నర్ తమిళిసై వీరిద్దరికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసే అర్హతలు లేవని తిరస్కరించారు.అనంతరం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల జరగడం, కొత్త ప్రభుత్వం ఏర్పడడం చకచకా జరిగిపోయింది. తమ పేర్లను గవర్నర్ ఆమోదించకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను



ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని కోర్టుకు తెలిపారు. కేబినెట్ నిర్ణయాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ కు లేదని పేర్కొన్నారు.ఈ పిటిషన్‌లపై హైకోర్టులో విచారణ జరిపారు. హైకోర్టు ఏ విషయం తేల్చేవ–రకూ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఎంపిక ఉండబోదని రాజ్ భవన్ వర్గాలు చెప్పాయి. ఈలోపే ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్ పేర్లను కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాకు ప్రతిపాదించింది. ఈ సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలిపారు.తమ పిటిషన్ పెండింగ్ లో ఉండగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఆమోదించడంపై దాసోజు శ్రవణ్ , సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ పిటిషన్ పై తదుపరి విచారణ వరకు ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం వద్దని హైకోర్టు ఆదేశించింది. తాజాగా ఈ నియామకాలను రద్దు చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కోదండరాం, అలీఖాన్‌లకు మళ్లీ ప్రతిపాదిస్తారా కొత్త వారికి అవకాశం ఇస్తారా అనేది తేలాల్సి ఉంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# యాభై లక్షల హవాలా నగదు స్వాధీనం

**రంగారెడ్డి- ప్రభాతసూర్యుడు :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా తరలిస్తున్న హవాలా డబ్బును పోలీసులు పట్టుకున్నారు. ఇన్నోవా క్రిస్టా కార్ లో తరలిస్తున్న 50 లక్షల హవాలా డబ్బు ను మాదాపూర్ ఎస్ఓటి పోలీసులుపట్టుకున్నారు. బుధవారం రాత్రి 12:30 గంటల సమయంలో డబ్బు తరలిస్తున్న విక్రమ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు విక్రం ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులను మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించారు. డబ్బుల గురించి అడగగా రియల్ ఎస్టేట్ డబ్బులు అని ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. దొరికిన 50 లక్షల రూపాయలను ఐటి డిపార్ట్మెంట్ కి అప్పగిస్తామని రాయదుర్గం పోలీసులు వెల్లడించారు.



# సంపాదకీయమ్..

## ఎన్నికల నిర్వహణ కత్తిమీద సామే

దేశంలో సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. మార్చి రెండో వారంలో షెడ్యూల్ ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈసీ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూలు ఎప్పుడు వెలువడుతుందోనని అన్ని పార్టీలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. సెకండ్ వీక్‌లో ఎప్పుడైనా రిలీజ్ కావచ్చనే అంచనాతో ఉన్నాయి.ఈ నేపథ్యంలో మార్చి 13న షెడ్యూల్ ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించి మే నెల చివరి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది.ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం రాష్ట్రాల పర్యటనలో ఉన్నారు. పది రోజుల్లో 12 రాష్ట్రాల్లో పర్యటన షెడ్యూల్ ఖారారైంది. 29కిపైగా సభల్లో ప్రసంగించనున్నారు. ఈనెల 13న పర్యటన ముగుస్తుంది. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశ ఉంది.పార్లమెంటు ఎన్నికలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నిలకకు ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇక షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి. మోదీ రాష్ట్రాల పర్యటన కోసమే ఈసీ షెడ్యూల్ ప్రకటించడం లేదని తెలుస్తోంది. 2019లో మార్చి 10న షెడ్యూల్ ప్రకటించిన ఈసీ ఏప్రిల్ 11 నుంచి 19 మధ్య ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించింది. మే 23న ఫలితాలు ప్రకటించింది. ఈసారి కూడా దాదాపుగా అదే షెడ్యూల్ ఉండే అవకాశం ఉంది. మార్చి రెండో వారంలో షెడ్యూల్ ఇచ్చి మే చివరి వారంలో ఫలితాలు ప్రకటిస్తుందని తెలుస్తోంది 6 నుంచి 8 దశల్లో ఎన్నికలు జరుగుతాయని సమాచారం.ఇక తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలు లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. నీ ఈ నెల 11న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లు, పలువురు అధికారులు అన్ని రాష్ట్రాల్లోని సీఈఓలు, సెంట్రల్ ఎలక్షన్ అబ్జర్వర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొన్ని సూచనలు, ఆదేశాలు ఇవ్వనున్నారు. దీంతో అప్పటివరకూ షెడ్యూలు విడుదల చేసే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు ఈ నెల 13న ప్రధాని మోడీ జమ్ము కశ్మీర్ పర్యటన ఉన్నందున అది ముగిసిన తర్వాతనే షెడ్యూలు విడుదలయ్యే అవకాశమున్నది. లోక్‌సభ ఎన్నికలతో పాటే జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి కూడా ఎన్నికలు నిర్వహించాలని ఈసీ భావిస్తున్నది.అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం సెంట్రల్ ఎలక్షన్ అబ్జర్వర్లను ఖరారు చేసింది. ఆయా రాష్ట్రాల్లోని సీఈఓ (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) ఆఫీసుల్లో పనిచేస్తున్న సీఈఓ, అదనపు సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, ఎలక్షన్ కమిషన్ తరఫున పనిచేస్తున్నవారికి 'బ్రీఫింగ్ మీటింగ్' నిర్వహించేందుకు ముహూర్తాన్ని ఖరారు చేసింది. ఈ నెల 11న ఉదయం 9.00 గంటల నుంచే ఇది జరుగుతుందంటూ ఆయా రాష్ట్రాల తరపున హాజరుకావాల్సిన అధికారుల (ఐఏఎస్, ఐపీఎస్) జాబితాను పంపింది. ఆ ప్రకారం తెలంగాణ నుంచి 2012–15 మధ్య బ్యాచ్‌లకు చెందిన 13 మంది ఐఏఎస్ అధికారులు హాజరు కావాల్సిందిగా సర్క్యులర్ పంపింది. దీనికి తోడు పలువురు ఐపీఎస్ అధికారుల లిస్టును కూడా పంపింది. వీరంతా ఫిజికల్‌గా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే మీటింగ్‌కు హాజరుకానున్నారు.సీఈఓ, అదనపు సీఈఓ, డిప్యూటీ సీఈఓ లాంటి సీనియర్ బ్యూరోక్రాట్లు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. సాయంత్రం వరకూ ఇది కొనసాగనున్నందున ఈసీ నుంచి సూచనలు ఇవ్వడంతో పాటు ఆయా రాష్ట్రాల్లోని కొన్ని ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా అదనపు జాగ్రత్తలపైనా స్పష్టత రానున్నది. ప్రధాని జమ్ము కశ్మీర్ టూర్ ముగిసిన తర్వాత మాత్రమే షెడ్యూలు విడుదల చేయడానికి అవకాశం ఉన్నట్లు ఈసీ వర్గాల సమాచారం.మార్చి 13వ తేదీ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఆ లోపు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులు పూర్తి కావాలని స్పష్టం చేశాను. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో 97 కోట్ల మంది ఓటర్లు ఓటు వేస్తారు. లోక్ సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. లోక్ సభ ఎన్నికలతో అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది అని' జమ్ము కశ్మీర్ ఎన్నికల అధికారి పీకే పోల్ వెల్లడించారు.త్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సహా 18కు పైగా రాష్ట్రాల్లో పర్యటించిన కమిషన్ విద్వేషపూరిత ప్రసంగాలు, ఉచితాలు, ఎన్నికల ఖర్చులకు వ్యతిరేకంగా అధికారులను హెచ్చరించారు. అత్యధిక లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రమైన యూపీని సందర్శించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్.. ఏదైనా అక్రమాలు జరిగితే, జిల్లా మేజిస్ట్రేట్, సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ లేదా పోలీసు సూపరింటెండెంట్ బాధ్యత వహించాల్సి ఉ ంటుందన్నారు. ఇంతకు ముందు కూడా కమిషన్ సందర్శించిన రాష్ట్రాల పరిపాలనా, పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన వైఖరి అవలంబించాలని కోరింది,గత లోక్‌సభ ఎన్నికల్లో ఉల్లంఘనల రికార్డు ఆధారంగా జిల్లా మేజిస్ట్రేట్లు, సీనియర్ పోలీసు అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రవర్తనా నియమావళిని స్పష్టంగా ఉల్లంఘించిన వివిధ రాష్ట్రాల్లోని జిల్లాలను కమిషన్ గుర్తించింది. అయితే ఈ వ్యవహారం కమిషన్‌కు చేరడంతోనే చర్యలు తీసుకున్నారు. అందువల్ల నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంలో నిమిషం కూడా జాప్యం జరగదని అధికారులతో జరిగిన సమావేశంలో కమిషన్ స్పష్టం చేసింది. అయితే ప్రధాన కేసుల్లో ముందుగా కమిషన్‌కు సమాచారం అందించి, ఆ తర్వాతే అధికారులపై ఎవరూ ఒత్తిడి తీసుకురాకుండా చర్యలు తీసుకుంటారు.

# దశాబ్దాలుగా.. రాజకీయాల్లో మహిళలు

ఆ నలుగురు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలుగు రాష్ట్రాల రాజకీయాలను నిశితంగా గమనించిన వారికి ఓ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఒకప్పుడు ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో ఎంతోమంది మహిళా నేతలు కీలక స్థానాల్లో పని చేశారు. ముఖ్యమంత్రి ఎవరున్నా.. కీలక అమాత్య పదవుల్లో మాత్రం మహిళామణులు కూర్చు–నేవారు. రాజకీయంగానూ, ప్రజాసేవలో తమదైన ప్రత్యేకత చాటుకున్నారు. అయితే, ఆ పరిస్థితి ప్రస్తుతం మారిందని.. రాజకీయాల్లో మహిళల ప్రాభవం తగ్గిందనే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకప్పుడు ఏ విషయంపైనైనా, ఏదైనా సమస్యపైనా మహిళా నేతలు పూర్తి అవగాహనతో.. అధికారమైన, ప్రతిపక్షమైనా అవతలి నేతలను ముప్పు తిప్పలు పెట్టేలా మాట్లాడేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. అసభ్య పదజాలాలు, దూషణ, ప్రతిదూషణలతో దిగజారిపోయేలా ఉన్న రాజకీయాల్లో అతి కొద్ది మంది మహిళా నేతలు మాత్రమే అన్నింటినీ తట్టుకుని నెగ్గుకొస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. రాజకీయ ముఖచిత్రంలో అప్పటి మహిళా నేతల ప్రాధాన్యం, నేటి మహిళా నేతల మనుగడ ఎలా ఉందో ఓసారి పరిశీలిస్తే... 2014 ఎన్నికలకు ముందు వరకు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు హుందాగా సాగేవి. విమర్శలు కూడా సహేతుకంగానే ఉండేవి. పాలనాపరమైన అంశాల్లో లోపాలు ఎత్తి చూపించడం ద్వారా ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు చేసేవారు. పు–రుష నేతలకు ధీటుగా మహిళా నేతలు తమదైన మాటల తూటాలను పేల్చేవారు. ఈ జాబితాలో ఇటు శ్రీకాకుళం నుంచి అటు హైదరాబాద్ వరకూ ఎంతోమంది మహిళా నేతలు ఉన్నారు.

### సబితా ఇంద్రారెడ్డి



ఒకప్పుడు రాజకీయంగా ఉన్నత స్థానాలు అధిరోహించిన ఎంతోమంది మహిళా నేతలు ప్రస్తుత రాజకీయాల్లో తమ ఉనికిని చాటుకునేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది రాజకీయ విశ్లేషకుల భావన. గతంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రులుగా పని చేసిన సబితా ఇంద్రారెడ్డి, డీకే అరుణ, గల్లా అరుణకుమారి, పనబాక లక్ష్మి, అలాగే టీడీపీ హయాంలో మంత్రులుగా పని చేసిన నన్నపనేని రాజకుమారితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పని చేసిన కొత్తపల్లి గీత, కిల్లి కృపారాణి, బుట్టా రేణుక వంటి ఎంతోమంది మహిళా నేతలు రాజకీయంగా ప్రస్తుతం యాక్టివ్ గా కనిపించడం లేదు. సబితా ఇంద్రారెడ్డి కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పని చేసినప్పటికీ గతంలో మాదిరిగా ఆమె యాక్టివ్ గా ఉండడం లేదు.

### పురందరేశ్వరి



మరో కీలకమైన మహిళా నేతగా పురంధేశ్వరి పేరు చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిన దివంగత ఎన్టీఆర్ కుమార్తెగా రాజకీయ అరంగేట్రం చేసిన ఆమె.. తన తండ్రి ఏ పార్టీని అయితే వ్యతిరేకించారో అదే పార్టీలో చేరి కేంద్రంలో మంత్రిగా కూడా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆమె రాజకీయంగా ఒడిదొడుకులను ఎదుర్కున్నారు. గడిచిన పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్నారే తప్పితే.. ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు అన్న విషయం కూడా తెలీలేదు. ప్రస్తుతం ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేస్తున్న ఆమె.. రాజకీయంగా మునుపటి హోదా కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పనబాక లక్ష్మి ఒకప్పుడు కేంద్రమంత్రిగా పనిచేశారు. సమైక్య రాష్ట్రంలో ఈమె హవా ఎంతగానో నడిచింది. రాష్ట్ర విభజన తర్వాత ఈమె జాడ ఎక్కడ కనిపించడం లేదు. కిల్లి కృపారాణి కూడా 2009లో పార్లమెంటు స్థానానికి ఎన్నికయ్యారు. విభజన తర్వాత ఈమె కూడా తన రాజకీయ మనుగడ కోసం పాకులాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీకే అరుణ కూడా సమైక్య రాష్ట్రంలో మంత్రిగా పని చేశారు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఆశపడిన ఆమెకు.. అధిష్టానం అవకాశం కల్పించకపోవడంతో సైలెంట్ అయిపోయారు. టీడీపీలో కీలక నేతగా వ్యవహరించిన కావలి ప్రతిభా భారతి.. ఒకప్పుడు స్పీకర్, మంత్రిగా పని చేసిన ఆమె.. ఇప్పటికీ రాజకీయంగా ఉనికి కోసం ప్రయత్నిస్తున్నారు. తన రాజకీయ వారసురాలి కోసం ప్రయత్నాలు సాగిస్తున్న ఆమెకు ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కడం లేదు.

### సీతక్క



ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరుగాంచిన కొండా సురేఖ రాజకీయంగా ఎత్తుపల్లాలను ఎదు ర్కొని.. మళ్లీ ఇప్పుడు బలంగా నిలబడగలిగారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చేరి మళ్లీ పునఃవైభవం దిశగా అడుగులు వే–స్తున్నారు. అలాగే, మంత్రి సీతక్క సైతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఆదివాసీల కష్టాలు తీర్చిన మనిషిగా వారి మనసులు గెలిచి నిలిచారు. ఇక మిగిలిన మహిళా నేతల్లో చాలామంది రాజకీయంగా తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. గల్లా అరుణకుమారి పూర్తిగా రాజకీయాలకు దూ–రమైపోయారు. కిల్లి కృపారాణి మరోసారి తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

### డీకే అరుణ



ఒకప్పుడు మహిళా నేతలు చేసే విమర్శలు హుందాగా ఉండేవి. తాజా రాజకీయాల్లో ఆ విమర్శలు హుందాతనాన్ని కోల్పోవడం సహా ఆరోపణలు వ్యక్తిగత దూషణలకు సైతం వె–ళ్తోన్న పరిస్థితి కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలతో పోలిస్తే.. ఏపీలోని మహిళా నేతల తీరు కొంత ఇబ్బందికరంగానే కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అధికార వైసీపీ నుంచి మహిళా నేతలు ఆర్కే రోజా, విడదల రజిని మంత్రులుగా ఉన్నారు. వీరిలో మంత్రి రోజా వైసీపీ ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందారు. అయితే, కొన్నిసార్లు ఈమె చేసిన వ్యాఖ్యలు శ్రుతిమించి ఉంటున్నాయనే విమర్శలు సర్వ త్రా వినిపిస్తున్నాయి.

# మహాలక్ష్మిని వినియోగించుకున్న 24.05 కోట్ల మహిళలు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటివరకు 24 .05 కోట్ల మంది మహిళలు జీరో టికెట్ పై ప్రయాణించారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9, 2023న ప్రారంభించారు. జనవరి నెలలో మహిళా ప్రయాణికుల సంఖ్య రోజుకు 28.10 లక్షలకు పెరిగింది. కాగా ఫిబ్రవరి నెలలో రోజువారీ 30.56 లక్షలకు పెరిగింది. ఈ మార్చి నెలలో మహిళా ప్రయాణీకుల ఉచిత ప్రయాణం యొక్క రోజు వారీ గణాంకాలు ఈ విధంగా ఉన్నాయి. మార్చి 1వ తేదీన 32.08 లక్షలు, మార్చి 2న – 31.81 లక్షలు, మార్చి 3న 26.24 లక్షలు, మార్చి 4న 33.18 లక్షలు, మార్చి 5న 32.04 లక్షలు, మార్చి 6న 32.95 లక్షల మంది మహిళలు బస్సుల్లో జీరో టికెట్ విధానంలో ప్రయాణించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా



2404.65 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళల ప్రయాణీకుల ఉచిత ప్రయాణంపై సూచికలను పరిశీలిస్తే, మహిళల ప్రయాణాల పెరుగుదల గణనీయంగా పెరిగింది. డిసెంబర్ 2023 నెలలో రోజుకు సగటున 26.99 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని పొందారు.

# సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో అరెస్ట్

**ఖమ్మం- ప్రభాతసూర్యుడు :** వైద్యం కోసం వచ్చిన ఓ పేసేంట్ అటెండెంట్ తో అసభ్యంగా ప్రవర్తించిన ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ డిఎంహెచ్వో సీతారాం ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీతారాం రూల్స్ విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్లో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో కీర్తన జనరల్ దవాఖాన ఏర్పాటు చేసి ప్రాక్టీస్ చేస్తున్నారు. సత్తుపల్లికి 30 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో రెండు మేనేజ్ చేస్తున్నాడు. ఈనెల రెండవ తేదీన వైద్యం కోసం వచ్చిన ఓ మహిళను దవాఖానలో అడ్మిట్ చేసుకున్నాడు. పేషెంట్ వెంట అటెండెంట్గా వచ్చినా ఆమె చెల్లి తో అసభ్యంగా ప్రవర్తించడంతో తనను లైంగికంగా వేధించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బంధువులు ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించి కీచక డాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు డాక్టర్ నీ అరెస్టు చేశారు.

# సాగు నీటి కోసం రహదారిపై బైఠాయించిన రైతన్నలు

**మంథని - ప్రభాతసూర్యుడు :** పెద్దపల్లి జిల్లా మంథని పాత పెట్రోల్ బంక్ వద్ద రైతులు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు.భారిగా ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింప చేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న మంథని ఆర్డీవో హనుమాన్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సాగునీరును విడుదల చేస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేపై కేసు

## ఖండించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు



**ఆల్వాల్ - ప్రభాతసూర్యుడు :** మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై అల్వాల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైన విషయం పై భారాస కార్పొరేటర్లు స్పందించారు. అల్వాల్ డిసి శ్రీనివాస్ రెడ్డి వ్యవహార శైలి సరిగా లేదని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కి తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటు అని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అల్వాల్ మున్సిపల్ డిసి శ్రీనివాస్ రెడ్డి అగౌరవ పరిచారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కి మర్యాద ఇవ్వకుండా వినతి పత్రం తీసుకునేందుకు గంట పాటు తాత్సారం చేశారని అన్నారు. శాంతి యుతంగా ధర్నా చేస్తున్న తమపైకి డి సి తన వాహనాన్ని వేగంగా తీసుకువచ్చారని అన్నారు.మున్సిపల్ డి సి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐ పి సి సెక్షన్ లతో సహా ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి పై ఫిర్యాదు చేయడాన్ని బారాసా కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అల్వాల్ డి సి శ్రీనివాస్ రెడ్డి ని సస్పెండ్ చేయాలని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కి అనుకూలంగా డిసీ శ్రీనివాస్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును తప్పు పట్టారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215